## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి : జడ్పీ డిప్యూటీ సిఇవో స్వప్న


రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ డిప్యూటీ సిఇవో స్వప్న

**సిర్గాపూర్, మే 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ స్వప్న సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మల్సూర్ నాయక్, సూపరిండెంట్ ప్రభాకర్ రెడ్డి, అకౌంటెంట్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద

# 163 బిఎన్ఎస్ఎస్ 2023 సెక్షన్ అమలు

సిపి డా॥అనురాధ

**సిద్దిపేట రూరల్, మే 20, ప్రభాతవార్త :** జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ 2023 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ డా॥అనురాధ మంగళవారం తెలిపారు. ఈ నెల 22 నుంచి 29 వరకు జరిగే సప్లమెంటరీ పరీక్ష నిర్వహణకు జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. 22 నుంచి 29 వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో పోలీసు అధికారులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సిపి అనురాధ సూచించారు.

పశువుల అక్రమ రవాణా నియంత్రణకు

## జిల్లా సరిహద్దులో చెక్ పోస్టుల ఏర్పాటు

సిపి అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా సరిహద్దులో 7 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ డా॥అనురాధ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ చెక్‌పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని చెక్ పోస్టుల లో పోలీసు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్ట్‌లవారీగా సమన్వయంతో విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. పశువుల రవాణా విషయంలో పశుసంవర్ధకశాఖ వైద్యులు నిబంధనలు పాటించాలని.. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యలలో భాగంగా పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. చట్ట విరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అక్రమరవాణా నియంత్రించేందుకు నిఘా విభాగం అప్రమత్తంగా ఉంటుందన్నారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి చేస్తామన్నారు. జిల్లాలో రంగధాంపల్లి ఎక్స్ రోడ్, సిద్దిపేట రూరల్‌చౌరస్తా, అనంతసాగర్, అక్బర్‌పేట ఎక్స్ రోడ్, అనభేరి చెక్‌పోస్టు హుస్నాబాద్, గుర్జకుంట క్రాస్‌రోడ్, వంటిమామిడి చౌరస్తాలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ వివరించారు.

కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు రాకుండా

## అన్ని సౌకర్యాలు కల్పించాలి

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

**కోహెడ, మే 20, ప్రభాతవార్త :** కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు రాకుండా తగు సౌకర్యాలు కల్పించాలని తేమ శాతం రాగానే లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సెంటర్ సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని నాగసముద్రాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు ఎంత మంది రైతులకు డబ్బులు చెల్లించారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సముద్రాల గ్రామంలో ఇన్నోవేషన్ పార్కు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పార్కులో మోతుకు ఆకులతో పేపర్ ప్లేట్స్ తయారీ, జూట్ బ్యాగుల శిక్షణ ఇచ్చి తయారీ, వేస్ట్ పేపర్‌తో పెన్సిల్, పెన్నుల తయారీ, వేస్ట్ ప్లాస్టిక్‌తో టీషర్ట్, టైల్స్, చైర్ తయారు పార్కు సిబ్బంది తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని స్టార్ట్ ఆఫ్ కంపెనీలు వస్తాయని ఆమె తెలిపారు. ఆమె వెంట డిఆర్‌డివో జయదేవ్ ఆర్య, జడ్పీ సీఈవో రమేష్, సివిల్ సప్లై డిఎం ప్రవీణ్, ఆర్ డిఈ మహేష్, మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, స్విచ్ కో–ఆర్డినేటర్ అక్షయ్‌కుమార్, ఎంపిడిఓ జయరాం, ఇన్ ఇంచార్జి తహశీల్దార్ దేవేంద్ర, ఎంపివో శోభ, ఎపిఎం తిరుపతి, ఎపివో రంగనాయక్, పంచాయతీ కార్యదర్శులు, వివో ప్రెసిడెంట్, విఓఎలు తదితరులు ఉన్నారు.

మెప్మా రుణాలలో అక్రమాలపై

## మరోసారి కొనసాగిన విచారణ

-పొదుపు డబ్బులను డ్రా చేసినట్లు తేల్చిన జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ


మాట్లాడుతున్న జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ

**గజ్వేల్, మే 20 (ప్రభాతవార్త):** మెప్మా రుణాలలో అక్రమాలపై మరోసారి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆధ్వర్యంలో మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మెప్మా సిఓ, ఆర్‌పి, మహిళా గ్రూపు సభ్యులతో విచారించారు. అనంతరం జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ మాట్లాడుతూ విచారణలో భాగంగా ఐదు మహిళా గ్రూపులు రవిచంద్రిక, చైతన్య, బాలాజీ, నీలేశ్వరి, సరస్వతి గ్రూపుల సభ్యులను విచారించగా వారు తీసుకున్న రుణంతో పాటు వారు పొదుపుచేసిన డబ్బులను సైతం డ్రా చేసినట్లు తెలిపారు. మెప్మా రుణాలలో అక్రమాలపై బ్యాంక్ అధికారులను సైతం విచారించి పూర్తి నివేదికను అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్‌కు పంపిస్తామన్నారు. రెండుమూడు రోజుల్లో పూర్తి సమాచారం ఇస్తామన్నారు.

## రాష్ట్రానికి కావాల్సింది అందాల పోటీలు కాదు

తెలంగాణకు పూర్వ వైభవం రావాలి : మాజీ మంత్రి హరీష్‌రావు

**నంగునూర్, మే 20, ప్రభాతవార్త :**
మళ్లీ కెసిఆర్ రావాలి..తెలంగాణకు పూర్వవైభవం రావాలని యావత్ తెలంగాణ ప్రజానీకం ఎదురు చూస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మండల పరిధిలోని నాగరాజుపల్లిలో జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదో మార్పు తెస్తారని అనుకొని కాంగ్రెస్‌ను గెలిపిస్తే రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభి వృద్ధిలో వెనుకకు నెట్టి దివాలా తీస్తున్నాడని తెలిపారు. వర్షాలు సకాలంలో కురిసి మంచి పంటలు పండాలని అమ్మవారిని ప్రార్థించారు. తెలంగాణలో పథకాల అమలుకు నిధులు లేవని అందాల పోటీల నిర్వహించడానికి మాత్రం నిధులు వచ్చాయన్నారు. రాష్ట్రానికి కావాల్సింది అందాల పోటీలు కాదని తెలంగాణ పూర్వ వైభవం కోసం ప్రజలు ఎదురు చూస్తుందన్నారు. ఆయనవెంట పార్టీ శ్రేణులు ఉన్నారు

# భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్


మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్

**హుస్నాబాద్ రూరల్, మే 20, ప్రభాతవార్త**
రాష్ట్రంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఘన్‌పూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు హెలికాప్టర్‌లోవచ్చిన ఆయన హుస్నాబాద్‌లోని మినీ స్టేడియంలో దిగారు. హుస్నాబాద్‌కు వచ్చిన మంత్రి శ్రీనివాస్‌కు స్థానిక శాసనసభ్యులు, రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరితో కలసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2 నుంచి అన్ని రెవెన్యూ గ్రామాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారన్నారు. వీలైనంత వరకు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరువేల మంది లైసెన్స్ సర్వేయర్‌లను నియమించి మూడు నెలలు శిక్షణ ఇచ్చి ప్రతీ మండలానికి 8 మందికి తగ్గకుండా సర్వేయర్లను నియమిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడుతలో 4 లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేశామని, ఈ నెలాఖరులోగా లబ్దిదారులను ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 9,872 మంది చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వబోతున్నామని, ప్రతీ నియోజకవర్గంలో 3వేల 5వందల ఇందిరమ్మ ఇండ్లతోపాటు గిరిజనుల సంఖ్యను బట్టి ఇళ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. హుస్నాబాద్‌కు వచ్చిన రెవెన్యూ మంత్రికి మంత్రి పొన్నం నియోజకవర్గంలోని పోడుభూముల సమస్యల గురించి వివరించారు. అనంతరం మంత్రి పొన్నంతో కలిసి రోడ్డు మార్గం ద్వార సైదాపూర్ మండలంలో జరిగే రెవెన్యూ సదస్సుకు బయలుదేరి వెళ్లారు.

# డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి బదిలీ

-జహీరాబాద్ డిఎస్‌పిగా సాయిధా

**జహీరాబాద్, మే 20, ప్రభాతవార్త:** జహీరాబాద్ డివిజనల్ పోలీసు అధికారిగా (డిఎస్‌పి)గా విధులు నిర్వహించిన పి.రామ్మోహన్‌రెడ్డిని బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి జహీరాబాద్‌లో ఏడాదిన్నర సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ వచ్చారు. రామ్మోహన్‌రెడ్డి స్థానంలో నల్గొండ జిల్లా సూర్యపేట డిఎస్‌పిగా సేవలు అందిస్తున్న సాయిధాను జహీరాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.


అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్ దృశ్యం

## అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ల సీజ్

**ధూళిమిట్ట, మే 20, ప్రభాతవార్త :** మండలంలోని జాలపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక నిల్వ చేశారని విశ్వసనీయ సమాచారం మేరకు తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ మంగళవారం గ్రామ శివారులోని పొలాలు, నిర్మాణంలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లిచూడగా దాదాపు 20 ప్రాంతాలలో 100 ట్రాక్టర్ ట్రిప్పులకు పైగా ఇసుక నిల్వ ఉండడాన్ని గమనించారు. వివిధ ప్రదేశాలలో ఉన్న ఇసుకను ఒకదగ్గర డంప్ చేసే అవకాశం లేనందున ఇసుకను వేలం వేసే వరకు ఎవరూ ముట్టుకోరాదని ఎవరైనా ముట్టినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రవిందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# జహీరాబాద్‌లో సిఎం పర్యటన చరిత్రాత్మకం కావాలి

అభివృద్ధిలో జిల్లా రూపురేఖలు మారాలి... వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి బ్యూరో, మే 20, ప్రభాతవార్త:**
ఈనెల 23వతేదీన జహీరాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటనపై కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లతో సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన తెలంగాణ రాష్ట్రంలో చారిత్రాత్మకం కావాలన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో రూపురేఖలు మారుతాయన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో బసవేశ్వర విగ్రహావిష్కరణ, కేంద్రీయ విద్యాలయ నూతన భవనం ప్రారంభోత్సవం, మహిళా పెట్రోల్ బంకు, జిల్లా అభివృద్ధికి కావలసిన కొన్ని కార్యక్రమాలను శంకుస్థాపనలు చేసి, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించి సభలో పాల్గొంటారని తెలిపారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జహీరాబాద్ నియోజకవర్గానికి ఎన్నో పరిశ్రమలను తీసుకువచ్చి, ప్రజలందరికీ ఉపాధి కల్పించిందని గుర్తు చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని పక్కా ప్రణాళికతో సీఎం పర్యటన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## 40 టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత



పిడిఎస్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు

**సిర్గాపూర్, మే 20, ప్రభాతవార్త:** 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీ (కెఎ 56 7022)ని సోమవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం...మండల పరిధిలోని పోచారం చౌరస్తా వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న తరుణంలో అటుగా వచ్చిన లారీని తనిఖీ చేయగా 40 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం ఉన్నాయి. కర్ణాటకలోని గురుమిట్కల్ నుంచి పిట్లంకు లారీ వెళుతున్నట్లు గుర్తించామన్నారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీపై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సజీవుద్దీన్ చేసిన ఫిర్యాదు మేరకు లారీ యజమాని జాకీర్‌మియా డ్రైవర్ అనిల్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## లేబర్ కోడ్స్ కార్మికుల ఉనికికే ప్రమాదం

సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 20, ప్రభాతవార్త :** కార్మికుల ఉనికికే ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర జాతీయ సంఘాల పిలుపు మేరకు మంగళవారం స్థానిక ఐబీ నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చుక్కా రాములు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా రూపొందించబడిన నాలుగు లేబర్ కోడ్స్ అత్యంత ప్రమాదకరమైనవని ఆయన పేర్కొన్నారు. కార్మిక చట్టాలు, హక్కులను కాలరాస్తూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా లేబర్ కోడ్స్‌ను రూపొందించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేశం జి.సాయిలు, ఐఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్‌రెడ్డి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.ప్రసాద్, సిఐటియు నాయకులు బాగారెడ్డి, యాదగిరి ప్రవీణ్, వివిధ యూనియన్ల నాయకులు మల్లారెడ్డి రాందాస్ కొండల్ రెడ్డి రమేష్ ప్రవీణ్ చంద్రయ్య శోభ లక్ష్మణ్ యాదయ్య విట్టల్ నాగభూషణం విష్ణు భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలుడు అదృశ్యం

**పటాన్‌చెరు, మే 20, ప్రభాతవార్త:** బోల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడు అదృశ్యమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బొల్లారం ఎస్ఐ కథనం ప్రకారం... సోమవారం మధ్యాహ్నం చర్చి బస్తీ బొల్లారంలో ఉండే గోపాల్(14) 7వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం షాప్‌కి వెళ్లివస్తానని ఇంటి నుండి బయలుదేరి తిరిగి రాలేదని, చుట్టుపక్కల వెతికినా అతడి ఆచూకీ తెలియలేదని తండ్రి సురేంద్ర తెలిపారు. కంగారుపడిన కుటుంబసభ్యులు బోల్లారం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. కాగా సురేంద్ర భార్య పిల్లలతో ఒరిస్సా రాష్ట్రం నుండి వలస వచ్చి, బొల్లారంలోని కంపెనీలో పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. బాలుడి ఆచూకీ తెలిసినవాళ్లు బొల్లారం పోలీస్ స్టేషన్ 8712656729, 8712661841 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

## పిడుగుపాటుకు గేదె మృతి


మృతి చెందిన గేదె

**నారాయణఖేడ్, మే 20 ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా ఖేడ్ మండలంలోని సంజీవనరావుపేట గ్రామంలో పిడుగుపాటు కారణంగా పేద రైతుకు చెందిన గేదె మంగళవారం మధ్యాహ్నం మృతి చెందింది. గ్రామానికి చెందిన సట్టి నరసయ్య గేదెను పొలంలోని చెట్టు కింద కట్టేసి పనుల్లో ఉండగా, అకస్మికంగా పిడుగుపడింది. ఈ ఘటనలో సుమారు రూ.1లక్ష విలువగల గేదె అక్కడికక్కడే మృతి చెందింది. పాల ఉత్పత్తి ఆధారంగా జీవనం సాగిస్తున్న నరసయ్యకు ఇది తీరని నష్టం అని గ్రామస్తులు చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న నరసయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం ఇవ్వాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా లోపం

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు


ఇందిరమ్మ నమూన ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపం కనిపిస్తున్న దృశ్యం

**టేక్మాల్, మే 20 ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం నిర్మించబోయే ఇందిరమ్మ ఇళ్ల నమూనాను టేక్మాల్ మండల కేంద్రంలో నిర్మాణం చేస్తుంది ఇదే! ఇంటి స్థలం ఉన్న పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకుగాను శ్రీకారం చుట్టింది. మండల కేంద్రంలో ఓ మోడల్ భవనం నిర్మిస్తే పేదవారు కట్టుకుంటే ఇలా ఉంటుందని చూపించడానికి నిర్మాణాలు చేపట్టారు. కాగా అది ఓ కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే డస్ట్‌తో నిర్మాణం చేపడుతూ నాసిరకంగా నిర్మాణం చేపట్టి ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాన్ని నగుబాటు చేస్తున్నారని మండిపడుతున్నారు. టేక్మాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు కాస్త నిర్మాణంలోనే పునాది కిందకు వెళ్లిపోయి నాణ్యతను పదిమందిలో ఇందిరమ్మ ఇళ్లంటే ఇలానే ఉంటాయా అంటున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన హౌసింగ్ శాఖకు అధికారులు లేకపోవడం గమనార్హం. పలు ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు అప్పగించినా వారు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పునాదులు తవ్వుకున్నప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగని పరిస్థితి. ముగ్గు నుంచి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేవరకు పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు హౌసింగ్‌శాఖలో లేరు. దీంతో మండల కేంద్రాల్లోనఇళ్లను పర్యవేక్షించడం వీరికి కత్తిమీద సాములా మారింది. గృహ నిర్మాణాధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లే అవకాశం లేకపోవడం, అధికారులు ఇందిరమ్మ ఇళ్లను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఒక స్థలంలో చూపించి మరో స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడం, పాత ఇళ్లకే రంగులు వేసి కొత్తవాటిగా చూపి బిల్లులు తీసుకున్నారనే విమర్శలున్నాయి. ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు చెక్ పెట్టాలని భావించిన ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది. సర్వే సమయంలో చూపిన స్థలంలోనే ఇళ్లను నిర్మించుకునేలా దానికి జియో పెన్సింగ్ విధానం అమలుచేయాలని నిర్ణయించింది. ఇకనైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి నాణ్యత నగుబాటు చేస్తున్నవారిపై చర్యలు తీసుకొని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలంటున్నారు.

### మెదక్ డిఈ వివరణ...

పైవిషయమై మెదక్ డిఈ యాదగిరిని వివరణ కోరగా ఇంటినిర్మాణం డస్ట్‌తో చేస్తున్నారని, పునాది కిందకు దిగిపోవడం ఏంటని ఇలాగే చేస్తారా అని ప్రశ్నించగా అలాంటిదేం లేదని ఇసుక కూడా వాడలన్నారు. నాణ్యతతో కట్టేలా మండల ఎఈతో మాట్లాడి అలా జరగకుండా చూస్తామని చెప్పారు.

## అదృశ్యమై.. అడవిలో శవమై...

**చిన్నశంకరంపేట, మే 20, ప్రభాతవార్త:** అదృశ్యమైన మహిళ అటవీ ప్రాంతంలో శవమైన ఘటన మండల పరిధి సూరారంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం.. నిజాంపేట మండలం రాజ్‌పల్లికి చెందిన బాలమల్లవ్వ(54) మార్చి 10న చిన్నశంకరంపేట మండలం భాగీర్తిపల్లిలో బీరప్ప జాతర కోసం బంధువుల ఇంటికి వచ్చింది. 13న గుడికి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకి లభించకపోవడంతో ఆమె కుమారుడు శ్రీరామ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సూరారం అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహం కుళ్లినస్థితిలో ఉందని పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై ఉన్న దుస్తులు వృద్ధురాలివిగా ఉండటంతో బాలమల్లవ్వ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలు, దుస్తులను గుర్తించి బాలమల్లవ్వదిగా గుర్తించారు. మృతదేహం కుళ్లిపోవడంతో ఘటన స్థలంలోనే వైద్యులు శవపరీక్ష నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నేత్రపర్వంగా సాగిన స్వామివారి శృంగార డోలోత్సవం



ఘటాభిషేక కార్యక్రమం 81 కలశాలతో నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 20 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి శృంగార డోలోత్సవం మంగళవారం కన్నులపండువగా నిర్వహించారు. పాంచరాత్రాగ శాస్త్రోక్తంగా ఉత్సవాలను పాంచరాత్రాగ శాస్త్రోక్తంగా ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న విషయం తెలిసిందే. విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, మహానివేదన, లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఘటాభిషేక కార్యక్రమం 81 కలశాలతో జరిగింది. అభిషేకం చేయించుకున్న వారికి స్వామి వారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇచ్చారు. మహానివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం పూర్తి అయిన అనంతరం స్వామివారి శృంగార డోలోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న వేదపండితులకు, అర్చకస్వాములకు సన్మాన కార్యక్రమం జరిగింది. బ్రహ్మోత్సవాలు ఈ కార్యక్రమంతో సమాప్తమయ్యాయి.

## ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా



కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖరంకు వినతిపత్రం సమర్పించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 20 ప్రభాతవార్త:**

బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయ ముందు పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖరంకు అందించారు. టిబిఎన్‌సిఐయు ప్రధాన కార్యదర్శి కల్లెపు చంద్రశేఖర్, జిల్లా నాయకులు ఆంజనేయులు, ఐఎఫ్‌టియు జాతీయ ప్రధాన కార్యదర్శి షేక్ షావలి, పివోడబ్ల్యు-స్త్రీవిముక్తి నాయకురాలు పి.సునీత, టియు జేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, కెహెచ్‌పిఎస్ అధ్యక్షుడు సుర్గు ప్రభాకర్, రవి, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు వై.మల్లేష్, ఎస్ఐవివి రేణుక, బిఎల్‌టియు నుంచి సునీల్, పియుకెవి అధ్యక్షుడు ఎ.యాదగిరి, టిపిఇ నఉుంచి రాంబాబు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## భగవంతున్ని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి



4వ వార్డు పికెట్‌లో పూజలు చేస్తున్న బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే వంశాతిలక్, నాగ భూషణ్‌రెడ్డి తదితరులు

**కంటోన్మెంట్,మే 20 ప్రభాతవార్త:** భగవంతున్ని వేడుకుంటే కోరిన కోరైలు నెరవేరుతాయని, అదే విధంగా మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని బిజెపి కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ వంశా తిలక్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, మహంకాళి జిల్లా బిజెపి అధ్యక్షుడు భరత్ గౌడ్, అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్‌లు తెలిపారు. బిజెపి సీనియర్ నేత నాగభూషణం రెడ్డి, శ్రీరామ్ క్యాట్రింగ్ ) ఆధ్వర్యంలో మంగళవారం పికెట్‌లోని సంతోష్ మాత దేవాలయం సమీపంలో నిర్వహించిన హన్‌మాన్ పూజా, హన్‌మాన్ చాలీసా వేడుకలకు వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు హేమంత్ శర్మ సారధ్యంలో అభిషేకం వంటి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విజయరామ రాజు, ధనుంజయ చారి, రాజ్ మల్లేశ్,టోపీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల సదనాన్ని సందర్శించిన చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి

**నిజాంపేట్, మే 20, ప్రభాతవార్త**

ప్రగతి నగర్‌లోని ప్రభుత్వ బాలల ప్రత్యేక సదనాన్ని తెలంగాణ స్టేట్ చైల్డ్ ప్రొటెక్షన్ అండ్ చైల్డ్ రైట్స్ కమిటీ చైర్ పర్సన్ కొత్తకోట సీత దయాకర్ రెడ్డి మంగళవారం సందర్శించారు. సదనంలో బాలలకు అందిస్తున్న వృత్తి శిక్షణతో పాటు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకును ఆమె పరిశీలించారు. బాలలకు అందిస్తున్న శిక్షణ పై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంచన రవీంద్ర గౌడ్, మారిపల్లి చందన, బి.అపర్ణ, గోగుల సరిత, పి.అగర్వాల్, బి.వచన్ కుమార్, సూపర్డెంట్ ఏ.ఎస్ గౌతమి, డిప్యూటీ సూపర్డెంట్ వై.కాశీ విశ్వనాథ్, ఎస్ హెచ్.ఎం ఉమేష్, టీచర్స్, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



హిమాయత్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, మే 20 ప్రభాతవార్త**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో కాచిగూడ కార్పోరేటర్ కన్నా ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వస్తాయన్నారు. అధికారులు వేగవంతంగా లబ్ధిదారులకు చెక్కులు అందేలా సహకరించాలని కోరారు.

## విదేశాల్లో స్థిరపడినా తెలుగుభాషా సంస్కృతిని వదలని సుప్రసిద్ధురాలు ఉమాభారతి

**-కేంద్ర మాజీమంత్రి డా. ఎస్.వేణుగోపాలాచారి**



హృదయగానం నవలను ఆవిష్కరిస్తున్న వేణుగోపాలాచారి, విజయబాబు, వంశీరామరాజు, విజయ తదితరులు

**రవీంద్రభారతి, మే 20 ప్రభాతవార్త :** విశ్వవిఖ్యాత మహోన్నత నటుడు ఎన్టీరామారావు సరసన నటించిన ఉమాభారతి విదేశాల్లో స్థిరపడినా మాతృభాష తెలుగు, సంస్కృతిని వదలకుండా గొప్ప రచయితగా, నాట్యగురువుగా ప్రఖ్యాతురాలిగా పేరొందడం, ఈరోజు ప్రతిష్టాత్మక వంశీ-ఎన్టీఆర్ ప్రవాసభారతీయ పురస్కారం పొందడం అభినందనీయం, హర్షదాయకమని కేంద్ర మాజీమంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి ప్రశంసించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, జె.వి.పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో వంశీ సంస్థల వ్యవస్థాపకుడు, కళాబ్రహ్మ, శిరోమణి వంశీరామరాజు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేణుగోపాలాచారి విశిష్ట అతిథులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు డా. పి.విజయబాబు, డా. సమ్మెట విజయ, సంతోష్‌బాబు, నండూరి సుందరీ నాగమణి తదితరులతో కలిసి ముందుగా కోసూరి ఉమాభారతిని ఘనంగా సన్మానించి వంశీ ఎన్‌టిఆర్ ప్రవాసభారతీయ పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం ఉమాభారతి రచించిన హృదయగానం నవలను డా. పి.విజయబాబు ఆవిష్కరించగా నండూరి సుందరీ నాగమణి పుస్తక విశ్లేషణ కావించారు. చివరిగా ఉమాభారతి రచించిన పుస్తకాలు నాట్యభారతీయంను డా. సమ్మెట విజయ; ఉమాభారతి కథలును సంతోష్‌బాబు కల్వకోట విశ్లేషణ చేశారు. కార్యక్రమాన్ని జ్యోతి వల్కబోజ్యుల నిర్వహించారు.

## దోమల బెడదను తప్పించడంలో అధికారులు విఫలం

**- మణికొండ బిఆర్‌ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ**



మణికొండ అల్కాపురి కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బిఆర్‌ఎస్ బృందం దృశ్యం.

**నార్సింగి, మే 20 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీలో దోమల బెడదను తప్పించడంలో మున్సిపల్ అధికారులు ఘోరంగా విఫలం అవుతున్నారని బిఆర్‌ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని అల్కాపురి కాలనీలో బిఆర్‌ఎస్ నాయకులు పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ అల్కాపురిలో జనాభాకు సరిపడ భవంతులు నిర్మితమయ్యాయి కానీ, మౌళిక వసతుల కల్పనలో అధికార యంత్రాంగం తాత్సారం చేస్తుందన్నారు. పెరిగిన జనాభాకు సరిపడ డ్రైనేజి వ్యవస్థను నిర్మించాలని డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ నుంచి విడుదలవుతున్న డ్రైనేజి నీటిని ఎస్టీపిల ద్వారా శుద్ధి చేసి నెక్‌నాంపూర్ చెరువులో కాకుండా మూసీలో వదిలిపెట్టాలని పేర్కొన్నారు. దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, సాయంత్రం వేళల్లో ప్రజలు మాట్లాడుకుంటున్నా నోట్లోకి వెళ్తున్నాయని తెలిపారు. అధికారులు ఆస్థి పన్నులు ముక్కు పిండి వసూలు చేయడంపైనే దృష్టి సారిస్తున్నారని, అదే స్థాయిలో వసతులు కల్పించడంపై కూడా పెట్టాలని సూచించారు. ఇంకుడు గుంతలలు కనుమరుగైనావని, వర్షాలు రాకముందే వాటిలోని చెత్త, చెదారం తొలగించాలని పేర్కొన్నారు. మంచినీటి ఇబ్బందులను తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, కిరణ్, రాజేంద్రప్రసాద్, ఆరిఫ్, భానుచందర్, సుమ నళిని, బాలాజీ, రమణమూర్తి, మహేందర్ పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడిగా కుమార్ యాదవ్

**-సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక**



అధ్యక్షుడిగా ఎన్నికైన కుమార్‌యాదవ్‌తోపాటు నూతన కార్యవర్గం

**హైదరాబాద్,మే 20, ప్రభాతవార్త:**

ఖైరతాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడిగా కంటెబోయిన కుమార్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఖైరతాబాద్ జైన్ భవన్లో జరిగిన యాదవుల సర్వసభ్య సమావేశంలో కుమార్ యాదవ్‌ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మానుక పాండు యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా మారబోయిన వెంకటేష్ యాదవ్, ఏశబోయిన రాజు (సురేష్) యాదవ్, మానుక గంగాధర్ యాదవ్‌లను ఎంపిక చేశారు. సంఘానికి గౌరవ సలహాదారులుగా మంగళారపు ఆంజనేయులు యాదవ్, కంటెబోయిన వెంకటేష్ యాదవ్, పగడాల మారయ్య యాదవ్, శెట్టి వెంకయ్య యాదవ్, గగనబోయిన కృష్ణ యాదవ్, తదితరులను ఎంపిక చేశామని సమావేశ సమన్వయకర్తలుగా వ్యవహరించిన యాదవ సంఘం హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మారబోయిన మల్లేష్ యాదవ్, ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మంగళారపు మల్లిఖార్జున్ యాదవులుతెలిపారు. అధ్యక్షుడిగా ఎంపికైన కుమార్ యాదవ్ మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేసి యాదవుల సమైఖ్యతకు, అభివృద్ధికి తనవం తు కృషి చేస్తానన్నారు. యాదవులకు శాశ్వతంగా ఒక కార్యాలయం ఏర్పాటుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు.

## నిజాం రాచరిక పాలన పై పోరాడిన ధీశాలి బండి యాదగిరి

**-విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వర్ రావు**

**చిక్కడపల్లి, మే 20 ప్రభాతవార్త:** నిజాం రాచరిక పాలన పై పోరాడిన ధీశాలి బండి యాదగిరి అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వర్ రావు అన్నారు. ఎందరో మహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా మంగళవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన విప్లవ కవి బండి యాదగిరి సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో ప్రాచుర్యం పొందిన వీర తెలంగాణ పోరాట ఘట్టంలో స్వయంగా రాసి పాడిన ఖిబండెనకఖి పాట నాడే కాదు నేడూ పోరాట స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. నాటి నిజాం కాలంలో వెట్టి చేసి బతుకులీడ్చిన దళిత బిడ్డ యాదగిరి అని, భూస్వాముల వద్ద పని చేస్తున్న సమయంలోనే సాయుధ పోరాట సైరన్ శబ్దాల్ని గమనించి ఉక్కు మనిషిలా పిడికిలి బిగించి దొర కింద చేసే చాకిరికి స్వస్తి చెప్పి జనం కోసం యుద్ధ భూమిలో తన ప్రాణాలను త్యాగం చేసిన వీరుడు అని అన్నారు. నిజాం గుండెలను ధథధడ లాడించిన పాట వింటేనే మట్టి మనుషులు సాగించిన సాయుధ విప్లవ రైతాంగ పోరాటం స్ఫూరిస్తుందని వివరించారు. యాదగిరి అక్షరాలకు నోచుకోక పోయినా ఆయుధాల్లాంటి పాటలు రాసి ప్రజల్ని మేల్కొల్పాడని పేర్కొన్నారు.

శత్రువులను గడగడలాడించి ప్రజల విముక్తి కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. సభలో మానస ఆర్ట్స్ సంస్థ అధినేత రఘుశ్రీ, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఎస్ బి రామ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థ భవనాలను గుర్తించాలి

**-రాబోయే వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి**
**-డిప్యూటీ కమిషనర్ రవి కుమార్**



**అత్తాపూర్ మే20,ప్రభాతవార్త :**

రాబోయే వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదాల జరగకుండా ముందస్తుగా శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించాలని డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఎసిపి,టిపిఎస్ ,ఎఎంఓఎహెచ్,శానిటేషన్ జవాన్స్‌తో డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ...రాబోయేది వర్షకాలం అన్ని కావున రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఎక్కడైన శిథిలావస్థకు చేరిన భవనాలు ఉంటే ముందస్తుగా గుర్తించి ఆ ఇళ్లలో నివసించే వారిని ఖాళి చేయించాలని సూచించారు.శిథిలావస్థకు చేరిన భవనాలో నివాసం ఉండకూడదని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని కావున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.తమ ప్రాంతాలలో శిథిలావస్థ భవనాలు ఉంటే ప్రజలు డిసి,అసిస్టెంట్ సిటి ప్లానర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎసిపి శ్రీధర్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలి : ప్రకాశ్



జిహెచ్‌ఎంసి కమిషనర్‌ను కలిసిన భాగ్య నగర్ మునిౕపల్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు ప్రకాశ్ తదితరులు

**కంటోన్మెంట్,మే 20 ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భాగ్య నగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ బి- 1157 (బి.ఎం.ఇ.యు) అధ్యక్షుడు కె.ప్రకాశ్ జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి అష్రప్, ఉపాధ్యక్షులు బసవన్న, శ్రావణ్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

## లోహియ నగర్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసిన లోహియ నగర్ వాసులు సంతోష్ యాదవ్ తదితరులు

**అడ్డగుట్ట,మే 20 ప్రభాతవార్త:**

మోండా డివిజన్ లోహియ నగర్‌లో రోడ్లు,డ్రైనేజీ, విద్యుత్ వంటి సమస్యలు అస్తవ్యస్థంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు విజ్ఞప్తి చేశారు. వెంటనే ఆయన స్పందించి తన దృష్టి ౖకి తెచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌లా కళాశాలలో న్యాక్ ప్రతినిధుల పరిశీలన



ప్రసంగిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి,

**చిక్కడపల్లి, మే 20 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ప్రాంగణంలోని లా కళాశాలను మంగళవారం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) ప్రతినిధులు సందర్శించారు. గత కొన్ని దశాబ్దాల కాలంగా నిరుపేద విద్యార్థినీ విద్యార్థులకు సంస్థ అందిస్తున్న విద్య తదితర అంశాల గురించి న్యాక్ ప్రతినిధులు విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, కార్యదర్శి, ఎమ్మెల్యే గడ్డం వినోద్, కరస్పాండెంట్ గడ్డం సరోజా వివేక్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాసంస్థల ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలని ఉద్దేశంతో విద్యాసంస్థల నెలకొల్పారని వివరించారు. ఇందులో భాగంగా విద్యకు అందిస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని సంస్థ గుర్తింపు కోసం వెళ్ళింది. ఇందులో భాగంగా మంగళవారం న్యాక్ బృందం విద్యాసంస్థల చైర్మన్‌తో పాటు సభ్యులు, కోఆర్డినేటర్లతో రెండు రోజుల పాటు లా కాలేజ్ ఆన్లైన్ ద్వారా పరిశీలించి మంగళవారం ముగించారు. రెండు రోజుల పాటు వెరిఫికేషన్, సంస్థ ప్రాంగణంలో అహ్లాధకరమైన వాతావరణం వసతులను పరిశీలించింది. వారం రోజులలో తుది ఫలితాన్ని తెలుపుతామని న్యాక్ ప్రతినిధులు విద్యాసంస్థల ప్రతినిధులకు వివరించారు. తమ కళాశాల ప్రాంగణాన్ని సందర్శించి న్యాక్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల జాయింట్ సెక్రెటరీ రమణ, గవర్నింగ్ కౌన్సిల్ మెంబెర్ ప్రియ అంగర్, డైరెక్టర్ విష్ణు ప్రియ, ప్రిన్సిపల్ సృజన తెలిపారు.

## బహుళ అంతస్థుల భవనాల్లో భద్రత కరువు

**ప్రభాతవార్త, అబిడ్స్ ప్రతినిధి :** జంటనగరాల్లోని బహుళ అంతస్థుల భవనాల్లో భద్రతా ఏర్పాట్లు నానాటికీ క్షీణిస్తున్నాయి. అగ్ని ప్రమాదాలతో పాటు అనుకోకుండా ఏదైనా ఉపద్రవం సంభవిస్తే లక్షాలాది రూపాయల ఆస్తి నష్టం సంభవించడంతో పాటు కొన్ని సార్లు ప్రాణనష్టం కూడా సంభవించడం జరుగుతుంది. ఈనెల18వ తేదిన తెల్లవారు జామున చార్మినార్ సాక్షిగా కూతవేటు దూరంలో మంటలు వ్యాపించి ఏకంగా రెండు కుటుంబాలకు చెందిన 17మంది అగ్ని కీలలకు ఆహుతై అయిన విషయం అందరికి తెలిసిందే. నగరంలో అక్రమంగా వెలసిన బహుళ అంతస్థులపై ఇప్పటికే ఒక వైపు వివాదం రాజుకు ని వాటిని తొలగించాలని న్యాయస్థానం ఆదేశించిన సందర్భాలు ఉన్నాయి. నగరంలోని బడా బాబుల బంగ్లాలలో ఉన్న వ్యవస్థాపరమైన లోపాలు ఉన్న పట్టించుకోరు. ఏదైనా భారీ సంఘటన జరిగినప్పుడే అటు పోలీసులు, మహానగరపాలక సంస్థ, ట్రాఫిక్, అగ్నిమాపకదళా అధికారులు భద్రత చర్యలు చేపట్టని భవనాల అనుమతి రద్దు చేస్తామని గొప్పలు చెప్పడం అటు తరువాత పట్టించుకోక పోవడం పరిపాటిగా మారింది. ఈ భవనాలకు ముఖ్యంగా పార్కింగ్ సౌకర్యం ఉండదు. ఐనప్పటికి అధికారులు అమ్యామ్యాలు తీసుకుని నిబంధనలను ఉల్లంఘించి అనుమతులు ఇస్తున్నారు. నగరంలోని బహుళ అంతస్థుల భవనాలలో ప్రమాదాలు సంభవించడం కొన్నేళ్లుగా రివాజుగా మారుతున్న ఈ విషయంలో అధికార యంత్రాంగం సవ్యంగా వ్యవహరించకపోవడం వల్లే తరుచు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటున్నాయి. మహానగరంలో ఏయేటి కాయేడు బహుళ అంతస్థుల నిర్మాణాలను జోరుగా నిర్మాణం జరుగుతున్నాయి. అయితే లెక్కల సంగతి ఎలా ఉన్న బహుళ అంతస్థుల భవనాలలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు, ప్రాణనష్టం లేకుండా ఆస్తినష్టం వీలైనంత తక్కువగా ఉండేలా చూసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు ఉండాలి అయితే నగరంలో అధిక శాతం బహుఅంతస్థులో కనీస భద్రతా ఏర్పాట్లు కూడా లేకపోవడం శోచనీయం నియమనింబంధనల ప్రకారం ప్రతి బహుళ అంతస్థుల భవనంలో తప్పనిసరిగా రెండు మార్గాలు ఉండాల్సి ఉంది. దీంతో పాటు అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు నీటిని వినియోగించే నిమిత్తం ప్రత్యేకంగా భూగర్భనీటి ట్యాంకులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికి తోడుగా అత్యవసర పరిస్థితుల్లో అగ్ని ప్రమాపక దళ యంత్రాలు భవనం చుట్టూరా సులభంగా తిరిగేందుకుగాను వీలుగా తగిన ఖాళీ ప్రదేశం ఉండేలా చూడాలి. ఈ ఖాళీ ప్రదేశం వీలైనంత విశాలంగా ఉండాల్సి ఉంటుంది. కాని నగరంలోని బహుళ అంతస్థుల భవనాలలో ఈ తరహా ఏర్పాట్లు ఉన్న బహుళ అంతస్థుల పదులసంఖ్యలో కూడా లేవంటే అతియోశక్తి ఎంత మాత్రంలేదు. నగరంలోని అబిడ్స్, సుల్తాన్‌బజార్, కోఠి ,సిద్దంబర్‌బజార్, నాంపల్లి, రాంకోఠి, బొగ్గులకుంట, హన్‌మాన్‌టేకిడి, బేగంబజార్, కిషన్‌గంజ్, మహరాజ్‌గంజ్, దూల్‌పేట్, తదితర ప్రాంతాలల్లో నిర్మించిన బహుళ అంతస్థుల భవనాలకు ఎలాంటి రక్షణ చర్యలు లేవు. ఈ భవనాలలో దురదృష్టావశాత్తు అగ్నిప్రమాదం సంబవిస్తే రక్షించేందుకుగాను అనేక ఇబ్బందులు తప్పవు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపకదళ యంత్రాలు సులభంగా వెళ్లేందుకు మార్గాలు లేకపోవడంతో మంటలను ఆర్పిందుకు అగ్నిమాపకదళ సిబ్బంది నానా తంటాలు పడాల్సి ఉంది.

నగరంలో బహుళ అంతస్థుల భవనాలలో తరుచూ చోటు చేసుకుంటున్న అగ్నిప్రమాదాలపై అదికారులు ఎప్పటికప్పుడు అది చేస్తాం ఇది చేస్తాం అంటూ చెప్పడం తప్పించి ఆచరణలో మాత్రం చూపలేకపోతున్నారు.

## అద్భుత గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి

**-వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు**



కాసి జొన్నవిత్తులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 20 ప్రభాతవార్త:** అద్భుత గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి అని వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామ రాజు అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో రిషి మ్యూజికల్ ఈవెంట్స్ అధినేత్రి, మధుర గాయని, విమెన్ ఐకాన్ అవార్డు గ్రహీత యోగిత ప్రభంజన్ అక్కిరాజు ఆధ్వర్యంలో పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా మధుర గాయని యోగితా అక్కిరాజు స్వరసారధ్యంలో బృందం సభ్యులు ఆయన రాసిన మధుర గీతాలను, పాటలను జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వంశీరామరాజు చేతులమీదుగా ప్రికాస స్టూడియోస్ అధినేత కాసి జొన్నవిత్తుల ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు చంటి తదితరులు పాల్గొన్నారు. తెలుగు పాటల సిరివెన్నెల సీతారామ శాస్త్రి అని అంటూ, తెలుగు సినీ పరిశ్రమలో ఎన్నో అద్భుతమైన పాటలను తెరకెక్కించారన్నారు. మనసుకు హత్తుకునే పాటలతో సినీ సంగీత ప్రియులను మంత్రముగ్దులను చేశారని పేర్కొన్నారు. పాటలో జీవితం కనిపించేంత అందంగా ఉంటుందని అన్నారు.

## జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించిన పాపిశెట్టి కార్తీక్‌కు సన్మానం



ఎస్‌ఎస్‌సి పరీక్షలలో 584 మార్కులు సాధించిన పాపిశెట్టి కార్తీక్‌ను ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సన్మానిస్తున్న దృశ్యం

**మైలార్‌దేవ్‌పల్లి,మే 20 ప్రభాతవార్త :**

పదివ తరగతి పరీక్షలలో 584 మార్కులు సాధించి రంగారెడ్డి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన పాపిశెట్టి కార్తీక్‌ను సోమవారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కలిసి సన్మానించారు. ఆర్య వైశ్య పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం తరుపున 21 వేల రూపాయలు, ఆర్య వైశ్య కుటుంబ సభ్యులు విరాళం ఇచ్చిన 51 వేల రూపాయలను పాపిశెట్టి కార్తీక్‌కు సంస్థ చైర్మన్ సోమ శ్రీనివాస్ గుప్తా అందజేశారు. పదోతరగతి పరీక్షలలో 584 మార్కులు సాధించి రంగారెడ్డి జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించిన పాపిశెట్టి కార్తీక్ గణేష్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. ఈ కార్యక్రమంలో గణేష్ నగర్ ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు నవారు మాణిక్యం రెడ్డి, సంఘం వ్యవస్థాపకులు రంగా ప్రభాకర్ గుప్తా, సంస్థ వైస్ చైర్మన్ సరాబు అనంత గుప్తా, కళ్యాణ మండలం అధ్యక్షులు సిరంగి బుచ్చయ్య గుప్తా, సంస్థ కోశాధికారి కొండా క్రిష్ణయ్య గుప్తా, డైరెక్టర్ ఒరుగంటి మల్లేష్, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్య దర్శి విజయ్ కుమార్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు వనమాల సురేష్ గుప్తా, అశోక్ గుప్తా, సందీప్ గుప్తా, శివ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, సూరిపెట్టి గుప్తా, రవికుమార్ గుప్తా, విజయ్ కుమార్, చంద్రశేఖర్, రవి కమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## 22.న, మల్లేపల్లిలో ఉద్యోగ మేళ

**నార్సింగి, మే 20 ప్రభాతవార్త :** ఈ నెల 22.వ,తేదీన మల్లేపల్లిలోని రంగారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 2.గంటల వరకు "ఉద్యోగ మేళ" నిర్వహిస్తున్నారని బండ్లగూడ కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో ఈ కామర్స్, బిపిఓ రంగాలలో ఉద్యోగాలు ఉన్నాయని, పది, ఇంటర్, డిగ్రీ చదువుకొన 18-30. సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉన్న నిరుద్యోగులంతా ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సర్టిఫికెట్ల విచారణ అనంతరం ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారని, వారికి కంపనీల యాజమాన్యమే శిక్షణను ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ శరత్‌చంద్ర సూచించారు.

## ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ లింగారెడ్డికి అభినందన సత్కారం



లింగారెడ్డిని సత్కరిస్తున్న తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాజీద్ అహ్మద్

**చిక్కడపల్లి, మే 20 ప్రభాతవార్త:** తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాజీద్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ వై లింగారెడ్డి అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీద్ అహ్మద్ మాట్లాడుతూ ఎస్ ఓ ఆర్ గురించి పలు విషయాల పైన సుదీరంగా చర్చ జరిపారు. ఇప్పుడు ఉన్నటు వంటి అధునాతన యుగంలో మెటీరియల్ కాస్ట్. లేబర్ కాస్ట్. పెరగడం వల్ల పనులు చేయలేకపోతున్నారని, ఎస్ ఎస్ ఆర్ రేట్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని మాజీద్ సూచించారు. దీంతో పాటు చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు విషయంలో సకాలంలో వచ్చేటట్లు ఏర్పాటు చేయాలని. ఎస్ ఎస్ ఆర్ రేట్లు అన్ని డిపార్ట్మెంట్లో ఒకే రేటు విధానం ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ వై లింగారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ ఇన్ బోర్డ్ మాజీ మెంబర్ సదానంద్ గౌడ్. మాజీ మెంబర్ నక్క యాదగిరి. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుజయ్ కుమార్. శీను నాయక్. రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు ఉచిత న్యూరో మెడికల్ క్యాంప్



మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న సరళాదేవి ఫౌండేషన్ సభ్యులు

**నిజాంపేట్, మే 20, ప్రభాతవార్త**

గైతమ్ న్యూరో కేర్, శ్రీ వాసవి ఆర్య వైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో సరళాదేవి జ్ఞాపకార్థం సరళాదేవి ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత న్యూరో మెడికల్ క్యాంప్‌ను మంగళవారం వాసవీ లే అవుట్ ప్రగతినగర్ జెడ్‌పి హైస్కూల్ నందు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌లో న్యూరో సర్జన్ కన్సల్టేషన్, ఈసిజీజీ, రక్తపరీక్షలు, సిబిపి. ఆర్ఎఫ్, ఎల్ఎఫ్టి, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్, న్యూరోపతి స్క్రీనింగ్, బాడి కంపోజిషన్ అనాలసిస్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ క్యాంప్‌లో కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా.ఉదయ్ గౌతమ్, కన్సల్టెంట్ న్యూరోలాజిస్ట్ డా. అల్లూరి నీరజ, కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా.సి. నిఖిల్ కుమార్, కన్సల్టెంట్ న్యూరోలాజిస్ట్ డా.యస్.నరేష్ కుమార్‌లు పాల్గొననున్నారు.



చిన్న జీయర్ స్వామికి పాద పూజ చేస్తున్న హరీష్‌రావు దంపతులు

## చిన్న జీయర్‌స్వామికి హరీష్‌రావు దంపతుల పాదపూజ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
సిద్దిపేటలోని హరీష్‌రావు క్యాంపు కార్యాలయానికి చిన్న జీయర్ స్వామి మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామికి హరీష్ రావు దంపతులు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ హరీష్‌రావు ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. హరీష్‌రావు పనితీరు..పట్టుదలకు ఎన్నో కార్యక్రమాలకు నిదర్శనమన్నారు. సిద్దిపేట నాటికి నేటికి ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం హరీష్‌రావు దంపతులు శ్రీనిత, పార్టీ నాయకులు, కార్యకర్తలకు చిన్న జీయర్ స్వామి అశీస్సులు అందజేశారు.

## మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి : షీటీం




చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సిబ్బంది

**హుస్నాబాద్ రూరల్, మే 20, ప్రభాతవార్త :** మహిళలు వారికి ఉన్న చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ షీటీమ్ బృందం అన్నారు. మంగళవారం మండలంలోని పోతారం(ఎస్) గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి వారికి ఉన్న చట్టాలతోపాటు ప్రస్తుతం సమాజం లో జరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఎలాంటి సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం అందించి సహాయం పొందవచ్చన్నారు. సహాయం కోసం 100, 8712667434, సైబర్ నేరానికి పాల్పడితే 1930లకు ఫిర్యాదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు పెద్ద పీఠ వేస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు అపరిచితులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ సదయ్య, కానిస్టేబుల్స్ ప్రశాంతి, స్వప్న, కృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.

## హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బిజెపి పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు

**హుస్నాబాద్ టౌన్, మే 20, ప్రభాతవార్త :** ఈనెల 22వ తేదీన హను మాన్ జయంతి సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఆర్యవైశ్య భవన్ నుండి గాంధీ రోడ్డు వరకు నిర్వహించబోయే హిందూ ఏక్తా యాత్రకు హుస్నాబాద్ నుండి హిందువులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర కరీంనగర్‌లో సాయంత్రం నాలుగు గంట లకు ప్రారంభమౌతుందన్నారు. సమావేశంలో నాయకులు సమ్మయ్య, రాం ప్రసాద్, రవి, అనంతస్వామి, రవీందర్‌చారి, శ్రీనివాస్, నాగార్జున్‌తో ఉన్నారు.

## మిస్ తెలంగాణ అర్తికి ఘనస్వాగతం



అర్తిని సన్మానిస్తున్న గ్రామస్తులు

**మిరుదొడ్డి, మే 20,ప్రభాతవార్త :** మిస్ తెలంగాణ అందాల పోటీల్లో ప్రథమ విజేతగా నిలిచిన ఆర్తి తొలిసారి స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా మంగళవారం రుద్రారం గ్రామస్తులు డప్పుచప్పుళ్ల మధ్య డీజే వాయిద్యా లతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కారించారు. తమ గ్రామానికి చెందిన ఆర్తి ఈనెల 18న హైదారాబాద్‌లోని సారథి స్టూడియోలో జరిగిన మిస్ తెలంగాణ అందాల పోటీలలో ప్రథమ విజేతగా గెలుపొందడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్తితో పాటు తల్లిదం డ్రులు తుమ్మల యాదగిరి పూజను ఘనంగా సన్మానించారు.

## ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రం

**మిరుదొడ్డి, మే 20,ప్రభాతవార్త :** కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి మద్దెల అంజయ్య డిమాండ్ చేశారు. జాతీయ రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలో కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పట్ల సిఐటియూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్బంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బిజెపి మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందన్నారు. కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలోనాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకరావడం జరిగిందన్నారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దేవదాసు రాజు, మన్నె కిష్టయ్య, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

# వైభవంగా శ్రీభూనీళా సమేత శ్రీనివాస కళ్యాణం

### పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యే

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లా కేంద్రంలోని శ్రీపద్మావతి సమేత శ్రీవేంక టేశ్వరస్వామి దేవాలయంలో శ్రీనివాస స్వర్ణోత్సవ సమారాహం, బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. స్వర్ణోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీభూనీళా సమేత శ్రీశ్రీనివాస కళ్యాణ మహోత్సవం చిన్నజీయర్‌స్వామి పర్యవేక్షణలో వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం చిన్న జీయర్‌స్వామి అనుగ్రహ భాషణం ను భక్తులు శ్రద్దగా అలకించారు.

### భక్తికి సేవకు సిద్దిపేట పెట్టింది పేరు

**త్రిదండి చిన్న జీయర్ స్వామి**

భక్తికి సేవకు సిద్దిపేట పెట్టింది పేరని త్రిదండి చిన్న జీయర్‌స్వామి అన్నారు. సామాజిక సేవే జీవి తంగా కలిగిన రాజకీయ నాయకులు ఉన్న ప్రాంతం సిద్దిపేట అన్నారు. పెద్ద జీయర్ స్వామికి సిద్దిపేట సొంత ఇంటిలా ఉండేదని గుర్తు చేశారు. అందరి ప్రగతి కోసం పార్టీలు వేరైనా దేవుడి సేవల్లో అంద రం కలిసి ఉండాలనేలా హరీష్‌రావు, రఘునందన్ రావు కార్యక్రమం నిర్వహించారని పేర్కొన్నారు.



భూనీళా సమేత శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

**స్వామి వారి కళ్యాణ మహోత్సంలో పాల్గొన్న ప్రముఖులు**

స్వర్ణోత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వ హించిన శ్రీభూనీళా సమేత శ్రీనివాస కళ్యాణ మహో త్సవం చిన్న జీయర్‌స్వామి పర్యవేక్షణలో వేదపండి తులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపి రఘుందన్‌రావు, మాజీమంత్రి,ఎమ్మెల్యే హరీష్‌రావు, మున్సిపల్ చైర్మన్ మంజుల దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. కాగా శ్రీనివాస ధాన్య మందిరంలో చిన్నజీయర్‌స్వామి తీర్థగోష్టి నిర్వహిం చారు. కార్యక్రమంలో హరీష్‌రావు చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా తీర్థం పుచ్చు కున్నారు. ఈ సందర్భంగా చిన్నజీయర్‌స్వామిని హరీష్‌రావు సత్క రించారు. అంతకుముందు ఆలయంలో హరీష్‌రావు పూజలు నిర్వహించారు. తీర్థగోష్టి సందర్భంగా హరీష్‌రావు వలంటరీగా సేవచేశారు. ఆయా కార్య క్రమంలో ఆలయ చైర్మన్ రమేష్‌విష్ణు, ఈవో విశ్వనాథ శర్మ, బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్, ఆలయ డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.



పన్నీరు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సాంస్కృతిక సారధి కళాకారులు

## దళితరత్న అవార్డు గ్రహీత శ్రీనివాస్‌కు సన్మానం

**జగదేవ్‌పూర్, మే 20 (ప్రభాతవార్త):** జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుడు, ప్రజా ఉద్యమ గాయకుడు పన్నీరు శ్రీనివాస్ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా దళితరత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ సామాజిక అంశాలపై గత 15 సంవత్సరాల నుండి కళా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ గాయకుడిగా, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసే సారధి కళాకారు నిగా, బహుజన గాయకునిగా ప్రజలను చైతన్యవంతులను చేసే విభాగంలో తనను దళిత రత్న అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం జాతీయ అధ్యక్షుడు గట్టగల్ల సంజీవ, ప్రజా కవి గాయకులు పిన్నింటి రత్నం, జనగామ శంకర్, కనకరాజు, సంజీవ్‌నాయక్, సోమయ్య, గణేష్, చందు, స్వప్న, చామంతి, మమత, రంజాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**కొండపాక, మే 20, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అధ్వరంలో చేపట్టిన పార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం మంగళవారం దుద్దెడ రైతువేదికలో నిర్వహిం చారు. కార్యక్రమంలో కొండపాక మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్ట పర్వ రాములు, ఎఈఒ పాల్గొన్నారు., ఈ సందర్భంగా పర్వరాములు మాట్లాడుతూ రైతులందరు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

## వృద్ధుడి ప్రాణాలు కాపాడిన ఆర్‌విఎం వైద్యులు

**ములుగు, మే 20 (ప్రభాతవార్త):** ప్రాణాలు పోయే పరిస్థితిలో ఆర్‌విఎం ఆసుపత్రికి వచ్చిన వృద్ధునికి ఆసుపత్రి వైద్యులు వైద్యం నిర్వహించి కాపా డారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే... జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన తాడూరి యాదగిరి(65) గత మంగళవారం ఓ శుభకార్యానికి వెళ్ళి భోజనం చేస్తుండగా మాంసంలోని ఒక బొక్క(ఎముక) కడుపులోకి వెళ్ళిపోయి అన్నవాహిక వద్ద ఆగిపోయింది. దీంతో అతడికి కడుపునొప్పి రావడంతోపాటు శ్వాసపరమైన ఇబ్బందులు తలెత్తి నోటి ద్వారా రక్తం రావడం జరిగింది. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు అతడిని ములుగు మండలం లక్ష్మక్క పల్లిలోని ఆర్‌విఎం ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు అతనికి పలు రకాల పరీక్షలు నిర్వహించి అన్నవాహిక వద్ద త్రిభుజాకారంలో ఉన్న ఎముక అడ్డుపడి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అలాగే అన్నవాహికకు రంధ్రం పడినట్లు గుర్తించారు. వెంటనే యాదగిరికి హెచ్ఓడి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ అభిషేక్, డాక్టర్ వరుణ్, డాక్టర్ భావన, డాక్టర్ శ్రీనివాస్‌ల బృందం కలిసి అధునాతనమైన నూతన సాంకేతికతను వినియోగించి ఓవిస్కో శస్త్ర చికిత్స నిర్వహించి కడుపులో ఉన్న ఎముకను తొలగించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ యాకయ్య, సీఈవో దేవరకొండ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వచ్చిన యాదగిరికి శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడడం జరిగిందన్నారు. తాడూరి యాదయ్యకు జరిగిన శస్త్ర చికిత్సకు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు అయ్యేదని, తమ ఆసుపత్రిలో అతనికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయడం జరిగిందన్నారు.



మాట్లాడుతున్న వైద్యుల బృందం



క్రికెట్ టీం సభ్యులను అభినందిస్తున్న వాసరి లింగరావు

## మండలస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదగాలి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగరావు**

**కొండపాక, మే 20, ప్రభాతవార్త :** క్రీడకారులు మండల స్థాయి నుండి జాతీయ స్థాయి క్రీడకారులుగా ఎదిగి మంచి పేరు ప్రతిష్టలు సంపాదించు కోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు క్రీడకారులకు సూచించారు. మంగవారం మండల పరిధిలోని వెలికట్టలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో బందారం, అంకిరెడ్డిపల్లి జట్లు తలపడగా విజేతగా నిలిచిన బందారం గ్రామ టీం సభ్యులకు, అదే విధంగా రన్నర్స్‌గా నిలిచిన అంకిరెడ్డిపల్లి గ్రామ టీం సభ్యులకు అయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తనతోపాటు క్రీడకారులను ప్రోత్సహించేందు ముందుకు వచ్చి ఇట్టి టోర్నమెంటును నిర్వహించిన పిఎసిఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్, సంపత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు, అనంతరం విజేతగా నిలిచిన బందారం టీంకు రూ॥ 15 వేలు, రన్నర్‌గా నిలిచిన అంకిరెడ్డిపల్లి టీం కు రూ॥ 8 వేలను ప్రకటించారు. అదే విధంగా మ్యాన్ అఫ్ ది మ్యాచ్ అయిన వ్యక్తి రూ॥ ఒక వేయ్యిని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్ట పర్వరాములు ప్రకటించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో పాల్గొన యువతకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో ఎరువుల దుకాణం దగ్ధం

**-రూ. 4 లక్షల ఆస్తి నష్టం**

**సిర్గాపూర్, మే 20, ప్రభాతవార్త:**



వాసర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో ఎరువుల దుకాణం కాలిపోయిన దృశ్యం

మండల పరిధిలోని వాసర్ గ్రామంలో గ్రామానికి చెందిన పవన్‌రెడ్డి నిర్వ హిస్తున్న ఎరువుల దుకాణం సోమవారం అర్ధ రాత్రి షాట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దుకాణంలోని ఈ పాస్ మిషన్, లైసెన్సు, రికార్డులు, పత్తి ప్యాకెట్లతో పాటు స్టాక్ అగ్నికి ఆహుతవ్వడంతో 4 లక్షల రూపాయల ఆస్తి నష్టం చోటు చేసుకుందని దుకాణం నిర్వాహకులు పవన్‌రెడ్డి పేర్కొన్నారు.

### అప్పాయిపల్లి రైతుల రిలే నిరహార దీక్షలు

**కొడంగల్, మే 20 ప్రభాతవార్త :** మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 19 దగ్గర మెడికల్ కళాశాలకు భూమి ఇచ్చిన రైతులు రిలే నిరా హర దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మెడికల్,వెటర్నరీ కళాశాలల కోసం 19 సర్వే నెంబర్ భూములు తీసుకొని ఇస్తామన్న నష్టపరిహారం పూర్తిగా ఇవ్వకుండా కొంత మంది అధికారులు, రాజ కీయ నాయకులు,దళారులు కుమ్ముక్కై ఎటువంటి భూములు లేని రికార్డులో లేని కాంగ్రెస్ కార్యకర్తలకు రూ.90 లక్షల వరకు దొంగలు,దోపిడిదారులకు డబ్బులు ఇచ్చి నిజమైన రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా పోలీసులను పెట్టి భూములు గుంజుకోవడం సరికాదన్నారు. ఈ దోపిడికి పాల్పడిన దొంగలను వెంటనే గుర్తించి వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకొని అర్హులైన రైతులకు నష్ట పరిహారం చెలించాలని తెలంగాణా ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్‌పల్లి శ్రీనివాస్, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

**గజ్వేల్, మే 20 (ప్రభాతవార్త):**
రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే రైతుల పక్ష పాతి అని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. గజ్వేల్ మండల పరిధి లో 8, జగదేవ్‌పూర్ మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలి పారు. 1వ తేదీ నుండి 20వ తేదీ వరకు సుమారు 15 లారీల ధాన్యాన్ని కొనుగోలుచేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే జగదేవ్‌పూర్ పిఎసిఎస్ పరిధి లో 35,811 క్వింటాళ్ళ ధాన్యం, గజ్వేల్ పిఎసిఎస్ పరిధిలో 32,662 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి 80 శాతం వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు. ఐకెపి, పిఎసిఎస్ సిబ్బంది రైతుల మంచి సేవలు అందిస్తున్నారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలుకు సహకరిస్తున్నారన్నారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తు న్నట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన పిఎసిఎస్ చైర్మన్ జేజల వెంకట్‌గౌడ్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యంను ప్రభు త్వం కొనుగోలు చేస్తుందని చెప్పినట్లు ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న వంటేరు నరేందర్‌రెడ్డి

అనంతరం వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ మాట్లా డుతూ బిఆర్ఎస్ ప్రభు త్వంలో వరివేస్తే ఉరి అన్న అప్పటి జిల్లా కలెక్టర్ వెంకట్రాంరెడ్డి మాట్లాడిన విషయాన్ని వంటేరు ప్రతాప్‌రెడ్డి మరిచిపోయారా అని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు లకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంటే జీర్ణించుకోలేక ప్రతాప్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకొని ప్రభుత్వానికి సహకరిస్తే బాగుంటుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ, డైరెక్టర్లు అక్కారం యాదగిరి, నర్సాగౌడ్, కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మండల మైనార్టీ మాజీ అధ్య క్షుడు అజ్జర్, నాయకులు మన్నె అరుణ్‌కుమార్, డప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మారిన విద్యుత్‌శాఖ అధికారుల ఫోన్ నెంబర్లు

**హుస్నాబాద్ రూరల్, మే 20, ప్రభాతవార్త :** హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని కోహెడ, బెజ్జంకి మండలాల విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది, సబ్ స్టేషనల్ల ఫోన్ నెంబర్లు మంగళవారం నుండి మారి మిర్చినట్లు విద్యుత్ శాఖ ఏడిఈ బెజ్జంకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఏడిఈ బెజ్జంకి 8712471358, కోహెడ ఏఈ 8712471342, ఏఈ బస్వాపూర్ 8712471317, కోహెడ లైన్ ఇన్స్‌పెక్టర్ 8712471325, లైన్‌మెన్ 8712471321, లైన్ ఇన్స్పెక్టర్ బస్వాపూర్ 8712471346, బస్వాపూర్ లైన్‌మెన్ 8712471322లతో పాటు 33 కెవి సబ్‌స్టేషన్ కోహెడ 8712471374, రామచద్రాపూర్ 8712471379, బస్వాపూర్ 8712471366, సీసీపల్లి 8712471384, సముద్రాల 8712471375 నంబర్లు ద్వార అధికారులు, సిబ ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారని వివరించారు.

## మానవ తప్పిదాల వల్లే సైబర్ నేరాలు : ఎస్ఐ

**అక్కన్నపేట, మే 20, ప్రభాతవార్త :** మానవ తప్పిదాల వల్లే ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని ఎస్ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. సోమ వారం రాత్రి మండల కేంద్రంలో పోలీస్ కళాబృందంతో ప్రజలను చైతన్యం చేసేందుకు కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మూడ నమ్మకాలను నమ్మవద్దని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. ప్రతీ వాహణ దారుడు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహన దారులు కచ్చితంగా హెల్మెట్ దరించాలని సూచించారు. అనంతరం కళాబృధం సభ్యులు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న కొన్ని సంఘటనలను గురించి పాటలు పాడి కళ్లకు కట్టినట్లు చూపించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి : ఎంఇవో



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**కొమురవెల్లి, మే 20, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలల ఎఫ్ఎల్/ఎస్‌జిటి ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణకార్యక్రమాన్ని ఎంఈవో రమేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మారాల న్నారు. విద్యాపరంగా విద్యార్థుల్లో గుణత్మక మార్పు తేవాలన్నారు. అభా స్యనా ఫలితాలపై పూర్తి అవగాహన ఏర్పార్చుకొని వాటిని సాధించేందుకు అమలు చేయాల్సిన ప్రణాళిక బోధన పరికరాల రూపాకల్పన, ఆహ్లాదంగా విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 5 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## శిక్షణ అనేది ప్రతి ఒక్కరికి అవసరమే : ఎంఇవో

**కొండపాక, మే 20, ప్రభాతవార్త :** ఎంత ఎక్కువగా నేర్చుకుంటే అంత మంచి నైపుణ్యం కలిగి ఉండి విద్యార్థులను మెరికల్లా తయారు చేయగలుగు తామని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. మంగళవారం కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధ్వర్యంలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యా యులకు ఎఫ్ఎల్ఎన్‌పై ఐదు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన చేపట్టి వారిలో విజ్ఞానాన్ని పెంచడం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని అయన సూచించారు. డిఆర్‌పి శ్రీనివాస్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్‌గా సత్యకృష్ణ, రాంప్రసాద్, అశోక్, శ్రీనివాస్, రాంచంద్రం, వెంకటరమణ వ్యవహరిం చారు. ఎడ్యుకేషనల్ సెక్రటరీ యోగితారాణ వీడియో కాన్పరెన్స్ ద్వారా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుతూ నాణ్యమైన విద్యనందిస్తు, పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాలలను రాష్ట్రంలో టాప్ టెన్‌లో ఉండేల కృషి చేయాలని సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి మండల పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

**సిఐటియు మండల కన్వీనర్ మరాఠి కృష్ణమూర్తి**



ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణమూర్తి

**జగదేవ్‌పూర్, మే 20 (ప్రభాతవార్త):** కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లను అమలులోకి తెస్తున్నారని, వాటిని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జగదేవ్‌పూర్ మండల కన్వీనర్ మరాఠి కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ కార్మిక సంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేసి ఉప తహసీల్దార్ రఘువీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 సంవత్సరాల తర్వాతకూడా భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేడు ముప్పు వాటిల్లిందని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తెస్తున్నారని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 12 గంటల పనిని చట్టబద్ధం చేయడం ఏమిటని ప్రశ్నించారు. సామాజిక భద్రత పథకాలకు ప్రభుత్వాలు నిధులు తగ్గిస్తున్నాయని, కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను కఠినతరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందని అన్నారు. కాంట్రాక్ట్ కన్సల్టెంట్ ఫిక్స్ టర్మ్ ఎంప్లాయి మెంట్ అప్రెంటిసిల పేరుతో పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో తాత్కాలిక ఉద్యోగులను ముందుకు తెచ్చి కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నాయన్నారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి కనీసం 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు లోకుల నర్సింలు, లింగాల యాదయ్య, కనకమ్మ, గొల్లపల్లి కిష్టయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంట శంకరయ్యకు ఘన నివాళి

**గజ్వేల్ టౌన్, మే 20 (ప్రభాతవార్త):** ప్రముఖ అంబేద్కర్ వాది స్వర్గీయ గంట శంకరయ్య నాలుగవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కుల సంఘ బాధ్యులు, అంబేద్కర్ భవన్ షాపింగ్ కాంప్లెక్స్, ఫంక్షన్‌హాల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అటుకూరి రాములు, మస్కూరి కిష్టయ్య, బొల్లారం ఎల్లయ్య, పంబాల సత్యనారాయణ, మన్నె కృష్ణ, రాజ్‌కుమార్, మైస నాగరాజు, సింగాటం చంద్రం తదితరులు పాల్గొన్నారు.



గంట శంకరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


పోచంపల్లి గ్రామంలో వర్షానికి తడిసిపోయిన ధాన్యం

## అకాల వర్షం.. రైతన్నకు అపార నష్టం

**చౌటకూరు, మే 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సరాపల్లి, పోచంపల్లి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు అపారంగా నష్టాలకు గురయ్యారు. వారం రోజుల క్రితం వర్షానికి తడిసిపోయిన ధాన్యాన్ని ఎండబెట్టి ఆరిపోవడంతో తూకం చేసే సమయంలో మరోమారు కురిసిన వర్షానికి తడిసిపోయాయి. వరి కొనుగోలు కేంద్రానికి ధాన్యం చేరుకోగానే తూకం వేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిసిఎంఎస్, ఐకెపి సెంటర్లు రైతులకు మ్యాచరు వచ్చినా గోనే సంచులు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలతో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పలు మార్లు అన్నదాతలు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకునే వారు లేక అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని చెప్పక తప్పదు. సంబంధిత అధికారులు స్పందించి రైతులు ఇబ్బందులకు గురికాకుండా కేంద్రానికి ధాన్యం చేసుకోగానే గోనె సంచులు అందించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైసు మిల్లులకు పంపేలా చూడాలని మండల రైతులు వినతి చేస్తున్నారు.

### ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట నర్సింలు

**హత్నూర మే 20, ప్రభాతవార్త :** మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఐదు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమం మంగళవారం దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. కార్యక్రమాన్ని మండల విద్యాధికారి కె.వెంకటనర్సింలు ప్రారంభించారు. ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కార్యక్రమలో 127 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమం వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు. శిక్షణ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలవరకు నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ వెంకట నర్సింలు తెలిపారు.

**సిర్గాపూర్‌లో...**


మాట్లాడుతున్న ఎంఈఓ నాగారం శ్రీనివాస్

**సిర్గాపూర్, మే 20, ప్రభాతవార్త:** విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న 5 రోజులపాటు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ కెపాసిటీ బిల్డిండ్‌పై జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన మండల స్థాయి రిసోర్స్ పర్సన్‌లు 8 మంది శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధన ఎలా చేయాలి? మెరుగైన విద్యను ఎలా అందించాలి? అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ స్వప్న, ఎఆర్‌పిలు రాజశేఖర్, ధూమ నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, రఘునాథ్, అనుముల గోపాల్, కృష్ణ, ప్రవీణ్, సిఆర్‌పిలు శివకుమార్,ప్రకాష్, శోభ, పిటిఐ ఆరే రవీందర్‌రావు, ఐఈఆర్‌టి చంద్రశేఖర్, ఉపాధ్యా సంఘాల (పిఆర్‌టియు, టిపిటిఎఫ్, యుటిఎఫ్) నాయకులు నర్సింగ్, శ్రీకాంత్, ఎంఎ రహీమ్, తవుర్యా నాయక్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు రేషన్ డీలర్ల సన్మానం


తహసీల్దార్ అనుదీప్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

**చౌటకూరు, మే 20, ప్రభాతవార్త:** మండల రేషన్ డీలర్లు మంగళవారం తహసీల్దార్ అనుదీప్‌కు రెవిన్యూ కార్యాలయంలో మర్యాద పూర్వంగా కలుసుకుని శాలువాలతో సత్కరించారు. రేషన్ సరుకుల పంపిణితో తాము ఎదుర్కొంటున్న సమస్యలను రేషన్ డీలర్లు తహసీల్దార్ దృష్టికి తీసుకుపోయారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు ఉప్పరి దేవదాస్, డీలర్లు సుభాష్, భాస్కర్‌రెడ్డి, శంకర్, ప్రసాద్, క్రిష్ణకాంత్, నారాయణరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

### జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి

**కల్హేర్, మే 20, ప్రభాతవార్త :** మండలం కేంద్రంలో జొన్నల కేంద్రాన్ని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. జొన్నల తూకం విషయంలో ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు రైతులకు అన్ని విధాలుగా జొన్నల కొనుగోలు కేంద్రాలలో సదుపాయాలు చూసుకోవాలని అధికారులకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, వీర్ శెట్టి, జిత్తురెడ్డి, మల్లొడ్డి తుకారాం, దేవిదాస్, జ్ఞానేశ్వర్ పాటిల్, రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ మే 20, ప్రభాతవార్త :** సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలిశారు. పెండింగ్‌లోఉన్న పనులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేసి...పనులు పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. సిద్దాపూర్, కందిలో అసంపూర్తిగా ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు కంది రూ.5 కోట్లు సిద్దాపూర్ రూ. 4 కోట్లు పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించినట్లయితే నెలరోజులలోపే వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశం ఉందని వివరించారు. సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో పెండింగ్‌లో వెజ్, నాన్‌వెజ్ బిల్డింగ్


అదనపు కలెక్టర్ తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

పనులు పూర్తి చేయాలని, సంగారెడ్డి, సదాశివపేట, ఆరుట్ల, పెద్దాపూర్‌లో సబ్ స్టేషన్ టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలని, సదాశివపేట మండల ఎంపీపీ బిల్డింగ్ నిర్మాణానికి రూ.85 లక్షల నిధులు మంజూరు చేయాలని, మినీ హజ్‌హౌస్ నిర్మాణానికి రూ.2 కోట్లు అదనంగా మంజూరుచేసి పనులు పూర్తిచేయాలని కోరారు. సంగారెడ్డిలో డంపింగ్ యార్డ్ పనులు వేగవంతం చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న మండల విద్యాధికారి తారాసింగ్

### విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి : ఎంఇవో

**నర్సాపూర్ మే 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అన్ని పాఠశాలల మండల స్థాయి ఎస్ జి టి, ఎల్ ఎఫ్ ఎల్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. శిక్షణ తరగతులు ఐదు రోజులపాటు కొనసాగుతుండగా మొదటి రోజున మండల విద్యాధికారి తారాసింగ్ హాజరై శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 రోజుల శిక్షణా తరగతులకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు హాజరు కావాలన్నారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులకు టీచింగ్ లెర్నింగ్, స్కిల్స్, ఎఫ్ ఎల్ ఎన్ కెపాసిటీ బిల్డింగ్ సంబంధించిన మార్గదర్శకాలను తెలియజేస్తారని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో 6 మంది ఆర్పీలు శ్రీనివాస్, సంతోష్‌కుమార్, సత్యనారాయణ, శివకుమార్, అప్పలనాయుడు, సునీత,కళా రాములు పాల్గొనగా ఎస్‌జిటి, ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులతో పాటు ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ సుధాకర్ గౌడ్, రూప, సిఆర్పిలు గోపాల్, నరసింహ చారి, విశ్వకాంత్ సుజాత పాల్గొన్నారు.

### టేక్మాల్‌లో ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ


ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ ఇస్తున్న దృశ్యం

**టేక్మాల్, మే 20 ప్రభాతవార్త:** మండల స్థాయిలో ఉపాధ్యాయులకు మంగళవారం ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్, ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా సబ్జెక్టు వారీగా బోధన టిఎల్ఎం తయారుచేయడం, విద్యార్థుల సామర్థ్యాల సాధింపునకు ఏ విధంగా కృషి చేయడం, బోధనలో సాంకేతికతను ఉపయోగించుకుని బోధనను సులభతరం చేసుకోవడం ఏ విధంగా అనే మెలకువలు ఈ కార్యక్రమంలో నేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సుజాత, ఆర్పీలు, మండలంలోని ఉపాధ్యాయులు, సిఆర్పిలు, ఎమ్ ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తి భావంతో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే


అంబాజీపేటలో రేణుకామాత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు తదితరులు

**చిన్నశంకరంపేట, మే 20, ప్రభాతవార్త:** భక్తి భావం ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధి అంబాజీపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, సుప్రభాత్‌రావు,రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మహిళా డిగ్రీ కళాశాలకు దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ మంజూరు

**గజ్వేల్, మే 20 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పరిసర ప్రాంతాల విద్యార్థిని విద్యార్థులకు అడ్మిషన్ సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సిద్దిపేట కళాశాలకు వెళ్ళాల్సి వచ్చేదని, ఇకనుండి ఎలాంటి సమస్యలైనా నేరుగా కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు వస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌లో కళాశాల దోస్త్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.జయరాజు, టెక్నికల్ అసిస్టెంట్స్ ఎన్.విజయ్, సిహెచ్.సందీప్‌లు అందుబాటులో ఉంటారని తెలిపారు.


అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్

### అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు

**రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్**

**జిన్నారం, మే 20, ప్రభాతవార్త:** మండలంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఆల్లినగర్ గ్రామం ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 27 లోని అక్రమ నిర్మాణాలను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిన్నారం మండల తహసీల్దార్ బిక్షపతి ఆదేశాల మేరకు సర్వే నెంబర్ 27 ప్రభుత్వ భూములో అక్రమ నిర్మాణాలను పరిశీలించామని, మరోసారి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

### నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య**

**కొండాపూర్, మే 20,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకంగా మంగళవారం. సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలోమండలంలోని సిహెచ్ కోనాపూర్, గంగారం, మునిదేవునిపల్లి, మాందాపూర్,తేర్పాల్, మారేపల్లి ,మాచేపల్లి, సైదాపూర్, మండల కేంద్రం కొండాపూర్, అనంతసాగర్, హరిదాస్పూర్ ఆయా గ్రామాలలో నిరసనలు సభలు నిర్వహించారు ఈ సందర్భంగా. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన. లేబర్ కోడలను రద్దు చేయాలి, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి, స్వామినాథ సిఫారసులను అమలు చేయాలి, ఉపాధి కూలీలకు 210 దినాలు కల్పించాలి రోజుకు 600 కూలి ఇవ్వాలి ,కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పోరేట్ అనుకూల రైతంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సీటు ప్లస్ 50 ప్రకారము మద్దతు ధరల చట్టం చేయాలని రైతు రుణాల రద్దు చేయాలని కౌలు రైతుల రక్షణ సమగ్ర చట్టం చేయాలని ఇండో అమెరికన్ ట్రేడ్ అగ్రిమెంట్లు తిరస్కరించాలని ఉపాధి హామీ పథకం 2 వందల రోజులకు రోజువారి కూలీ 600 పెంచాలని నూతన వ్యవసాయ మార్కెట్ పాలసీని రద్దు చేయకపోతే రైతంగం తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు రైతులు పండించే పంటల ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర కేటాయించి కొనుగోలు చేయాలన్నారు అసంఘటిత కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలని ఉపాధి హామీ కూలీలకు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల ఎక్స్‌గ్రేసియ, చెల్లించాలని ,పని చేసే చోట మెడికల్ కిట్లు పనిముట్లు ఇతరత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ప్రవీణ్, వెంకన్న సంజీవులు, వ్యవసాయ కార్మిక నాయకులు అమూర్తమ్మ, మధుకర్, గోపాల్, రత్నయ్య రైతు సంఘం నాయకులు శీను ,రాజు ,అంజయ్య ఆంజనేయులు పాల్గొన్నారు.

### సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**జగదేవ్‌పూర్, మే 20 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామానికి చెందిన బోగర్ల కనకమ్మ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా వైద్యానికి ఎక్కువ మొత్తంలో ఖర్చు కావడంతో సిఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి సహకారంతో మంజూరైన రూ.30వేల చెక్కును ఆమె భర్త బోగర్ల ఈదులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చాట్లపల్లి మాజీ ఎంపిటిసి కావ్య దర్గయ్య, మాజీ కొండపోచమ్మ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అఫ్జల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### బోరు మోటార్ ప్రారంభం

**చిన్నశంకరంపేట,మే 20,ప్రభాతవార్త:** మండల పరిధి అంబాజీపేటలోని బిసి కాలనిలో మండల ప్రజాపరిషత్ నిధులతో మంగళవారం నాడు మంచి నీటిని బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ జయమ్మ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉదయ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి రజనికాంత్, మండల మానవ హక్కుల కమిటి ఉపాధ్యక్షులు మంగళి లక్ష్మన్, ద్యాప బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.


బోరు మోటార్‌ను ప్రారంబిస్తున్న దృశ్యం

# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి

**కొల్చారం, మే 20, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో కొల్చారంలోని బాబాగార్డెన్‌లో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, నాయకులు సోమన్నగారి రవీందర్‌రెడ్డి, వర ప్రసాద్ హాజరయ్యారు. కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ అధ్యక్ష పదవుల కోసం కార్యకర్తల నుండి దరఖాస్తులును స్వీకరించారు. అంతకు ముందు బస్టాండ్ నుండి మెదక్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై సమ్మిదాన్ బచావో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ తగిన గుర్తింపునిస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చిల్ప్ చెడ్ మాజీ జడ్పిటిసి శేషసాయిరెడ్డి, ఎస్సిసెల్ జిల్లా కార్యదర్శి మరెల్లి అనిల్, మాజీ వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, నాయిని లక్ష్మయ్య, యెల్లుగారి శ్రీనివాస్ రెడ్డి మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సావిత్రి రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గోవర్ధన్, కొమ్ముల రవీందర్ గౌడ్, దుర్గేష్ గౌడ్, లక్ష్మయ్య, సొసైటీ చైర్మన్ మన్నే రాములు, మాందాపూర్ జనార్దన్ రెడ్డి, భూమయ్య, పండు నాయక్, ఆగం గౌడ్, గొండ కృష్ణ, నెల్లి రాజు, పట్లోరి అనిల్, పంతులు సంగమేశ్వర్, వడ్ల లక్ష్మీ మపతి, శంకర్ నాయక్, దేవరాజ్, బండి మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి

### టేక్మాల్‌లో కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

**టేక్మాల్, మే 20 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ తులసిరామ్ పంపిణీ చేశారు. మంగళవారం రైతు వేదికలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. 52 లక్షల 6 వేల 32 రూపాయల విలువగల మొత్తం 52 చెక్కులు అందజేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నిమ్మ రమేష్, సుబేదార్ మాన్ కిషన్, మెదక్ జిల్లా ఆర్టిఏ సభ్యులు మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ జడ్పీ కో ఆప్షన్ యూసుఫ్, శ్రీధర్‌చారి, కోపరేటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీలు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజుగౌడ్, సుధాకర్ సార్, ఆశిలి సాగర్, టేక్మాల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భక్తుల కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేష్‌గౌడ్, మండల మాజీ కోఆప్షన్ షేక్ మజహర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్, మండల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు అడివయ్య, మండల ఎస్టిసెల్ అధ్యక్షులు సేవాలాల్, మాజీ సర్పంచులు పాపయ్య, భూమిరెడ్డి, రామచందర్, నాయకులు శివ మల్లయ్య, సాయిబాబా, ఖలీల్, వసీం తదితరులు పాల్గొన్నారు.

### సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**పుల్‌కల్, మే 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన కొన్నింటి క్రిష్ణ మెరుగైన వైద్యం అందుకునేందుకు 60 వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి మంగళవారం అందజేశారు. చెక్కును అందుకున్న క్రిష్ణ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సి దామోదర రాజనర్సింహాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిమాణిక్యం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభుగౌడ్, యూత్ అధ్యక్షులు మ్యాతరి మల్లేశం, నాయకులు డప్పు మాణిక్యం, నర్సింలు, పెంటయ్య, శ్రీశైలం,మాణయ్య, శివకుమార్, రాజు, రోషన్‌కుమార్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**చౌటకూరు, మే 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన వడ్ల ఆంజనేయులు సోమవారం తిరిగిరాని లోకాలకు చేరిపోయినట్లు తెలుసుకున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా కుమార్తె త్రిష దామోదర్ మంగళవారం తన వంతుగా కుటుంబానికి 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ బాధిత కుటుంబ సభ్యులకు 10వేల రూపాయలను అందించి త్రిష దామోదర్‌తో ఫోన్‌తో మాట్లాడించారు. కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు త్రిష దామోదర్ ఫోన్‌లో ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుఉ శివకుమార్, కళాలి ఈశ్వర్‌గౌడ్, గొల్ల శివకుమార్, చల్లేటి మహేందర్‌రెడ్డి, గొల్ల అభిలాష్, చంటి రమేష్ పాల్గొన్నారు.

### ఎరువుల పంపిణీలో ఖచ్చితత్వం ఉండాలి : ఏడిఎ


ఎరువుల దుకాణదారులకు ఈపాస్ యంత్రాలను పంపిణీ చేస్తున్న ఏడిఎ

**జహీరాబాద్, మే 20, ప్రభాతవార్త:** ఎరువుల పంపిణిలో దుకాణదారులు ఖచ్చితత్వం పాటించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడిఎ) బిక్షపతి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రంజోల్ రైతు వేదికలో ఎరువుల డీలర్లకుఈపాస్ యంత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉన్నందున ఇక్కడి నుంచి కర్ణాటక రైతులు ఎరువులను కర్ణాటకకు తరలించే అవకాశాలు ఉంటాయని, అందుకు ఆధార్ లింక్ చేశాకే ఎరువులను అందించాలన్నారు. తాము దిగుమతి చేసుకున్న ఎరువులను ఎవరెవరికి ఎంతెంత అందించారో అన్న వివారలు ఈపాస్ యంత్రాల్లో విధిగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు లావణ్య, అభినాష్‌వర్మ, వినోద్‌కుమార్, హాప్సొద్దీన్, శ్రీకాంత్ రాహుల్, కోరమండల్ కంపెనీ ప్రతినిధులు పి ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి,జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

### జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏడిఎ


జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడిఎ నూతన్‌కుమార్

**నాగల్‌గిద్ద, మే 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడిఎ) నూతన్ కుమార్ మండల వ్యవసాయ అధికారి ప్రవీన్‌చారితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రానికి జొన్నలు తెచ్చిన రైతులు ఇబ్బందులకు గురికాకుండ చర్యలు తీసుకోవాలని కేంద్రం బాధ్యులకు సూచించారు. జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశక గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లతో సమావేశం అయి పలు సూచనలు చేశారు.

### సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే

**నిజాంపేట, మే 20 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బాచేపల్లి గ్రామానికి చెందిన గంజాయి రాజమ్మ, షేకలి బాలయ్య, శ్రీరామ్ ఆశయ, సాయి శ్రీరామ్ రమేష్, దొబ్బేట లక్ష్మిలకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ ఎక్స్ ఎంపిటిసి లింగారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాధా కిషన్ జమ్మికుంట మాజీ సర్పంచ్ రఘుపతి రెడ్డి ప్రవీణ్ గౌడ్ గారు యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ సుదర్శన్ గంజాయి సాయిలు గారు తదితరులు పాల్గొని సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది..

### తిరంగా యాత్రకు బయలుదేరిన బిజెపి నాయకులు

**నర్సాపూర్, మే 20 ప్రభాతవార్త :** ఆపరేషన్ సింధూర్ విజయం సాధించిన సాయుధ వీర జవాన్లకు సెల్యూట్ చేస్తూ మంగళవారం మెదక్ పట్టణంలో నిర్వహించే తిరంగా యాత్రకు నర్సాపూర్ నుండి బిజెపి పార్టీ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ఒక విజయం అనంతరం విరామం తీసుకుంటున్న భారత త్రివిధ దళాల విజయం యావత్ భారతదేశానికి ఒక వరం అంటూ దేశం మొత్తం సైనికులకు సెల్యూట్ చేస్తూ జేజేలు పలుకుతున్నారని అన్నారు. వారికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ మతాల పార్టీలకతీతంగా దేశ వీర సైనికులకు అభినందనలు తెలియజేస్తూ మెదక్ లోని తిరంగా యాత్రకు బయలుదేరి వెళ్లడం జరిగింది. తిరంగా యాత్రకు బయలుదేరినవారు బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్, నాయకులు రఘువీరారెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోద రాజేందర్, బిజెపి మండల అధ్యక్షులు నీలి నాగేష్, బిజెపి పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ కౌన్సిలర్ ఎరుకలి యాదగిరి బిజెపి నాయకులు తరలి వెళ్లారు.


తిరంగా యాత్రకు బయలుదేరిన బిజెపి శ్రేణులు